క్లుప్తంగా

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



అధికారులతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: గ్రాపంచాయతీల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే స్పందించి తమ దృష్టికి తీసుకురావాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హౌసింగ్, ఉపాధి హామీ, డ్వాక్రా, తాగునీటి, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రికార్డులను, ఫైళ్లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మొదలయ్యే అవకాశాలున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలుశాఖాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి



మహబూబ్ బాషా (ఫైల్)

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీ ముత్యాలమ్మ గుడివీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహబూబ్‌బాషా(40) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. రెండేళ్లుగా ఆయన క్యాన్సర్‌తో పోరాటం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఆయనకు చికిత్స నిమిత్తం లక్షలాది రూపాయలు వ్యయం చేసినా ఫలితం దక్కలేదు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరారు.

నివాళి

పెద్దపంజాణి: మండలంలోని నడింపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిరత్నం సోమవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సలహాదారు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి నడింపల్లెకు వెళ్లి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా నివాళులర్పించారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

పుంగనూరు: రంజాన్ పండుగ ఉపవాస దీక్షలకు ముస్లింలు మంగళవారం నుంచి పూనుకోనున్నారు. అంజుమన్ కమిటి ఆధ్వర్యంలో అన్ని మసీదులకు సోమవారం ఉపవాస దీక్షల సమాచారం పంపారు. ఉదయం సహార్ వేకువజామున 5:07నిమిషాలకు, సాయంత్రం ఇఫ్తార్ 6:30 నిమిషాలకు నిర్వహించాలని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ఖురాన్ పఠనం, పేదలకు అన్న, వస్త్రదానాలు చేయాలని, ఐదు పూటలా నమాజ్ చేయాలని పేర్కొన్నారు. పట్టణంలోని 26 మసీదులలోను ఏర్పాట్లను చేపట్టారు.

పలమనేరు: పలమనేరులో సోమవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైందని, మంగళవారం ముస్లింలు మొదటి ఉపవాసం ప్రారంభించాలని పలమనేరు టౌన్, మండల ప్రభుత్వ ఖాజి ముఫ్తి షేక్ అబ్దుల్లా కోరారు.

పరీక్ష సామగ్రి వితరణ




చౌడేపల్లె: మండలంలోని పరికిదొన ఉన్నతపాఠశాలలోని8,9,10వ తరగతుల విద్యార్థుల ఆమినిగుంటకు చెందిన విశ్రాంత ఎస్‌ఐ నరసింహులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రేగంటి యోగానంద కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థులకు ప్యాడ్లులు, జామిట్రీ బాక్సులు, స్కేలు, పెన్నులు మొదలైన వాటిని సోమవారం పంపిణీ చేశారు. స్కూలు టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించారు. హెచ్ఎం రవీంద్ర, రేగంటి రవికుమార్, యోగనిఖిల్‌నంద్, ఉపాధ్యాయులు ఆనందబాబు, శ్రీనివాసులు, నాగరాజ, ఫర్హజానా, కవిత, కల్పన, రెడ్డెప్ప, విజయమోహన్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ ఎన్. రెడ్డెప్ప సోమవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని వసతులు, అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. ఓపీ వివరాలను డాక్టర్ మౌనికను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, గీతాంజలి, కుసుమ పాల్గొన్నారు.

'బార్' కార్యవర్గం ఎన్నిక



లక్ష్మీపతి



భర్కత్

పలమనేరు: పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మీపతి ఎంపికయ్యారు. స్థానిక కోర్టులో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా భర్కత్, ఉపాధ్యక్షులుగా పరమశివప్ప, చంద్రశేఖర్, కార్యదర్శిగా సంజయ్, లైబ్రరీ సెక్రటరీగా జగదీష్, కోశాధికారులుగా రాజారెడ్డి, గుణశేఖర్, కల్చరల్ కార్యదర్శిగా రంజిత్‌షా, మహిళా ప్రతినిధిగా శ్రీనిజను ఎన్నుకున్నారు.

సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు

- రూ.1.39 కోట్లతో అభివృద్ధి పనులు
- పలుచోట్ల అట్టహాసంగా ఎమ్మెల్యే ప్రారంభోత్సవం



గంద్రాజుపల్లె ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు ఎప్పటికీ లభిస్తుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండలంలోని గంద్రాజుపల్లె-1, 2 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో రూ.1.39 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. బసవరాజుపురంలో రూ.20లక్షల జీజీఎంపీ నిధులతో సీసీ రోడ్డు, పెద్దఉగిణిలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.18.86 లక్షలతో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు, గంద్రాజుపల్లెలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సర్వం సిద్ధం

వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ క్యాడర్‌తో పాటు రాష్ట్ర ప్రజానీకం పూర్తిగా సిద్ధంగా ఉందని, జగనన్న సంక్షేమ పథకాలే మళ్లీ తమ పార్టీకి కడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాల జెండాలన్నీ కూటమిగా ఏర్పడినా అన్నింటినీ తట్టుకోగలిగే సత్తాతో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ఒకే ఒక్కడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అలవిగాని హామీలు ఎన్ని ప్రకటించినా అధికారం వచ్చాక ఒక్కటి కూడా అమలు చేయని బాబు కుటిల రాజకీయాలు ఎలాంటివో ప్రజలు ఎప్పుడో తెలుసుకున్నారన్నారు. ఈ ఐదేళ్లలో ప్రజా సంక్షేమం కోసం జగనన్న ఎన్నోసార్లు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేశారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండుసార్లు బటన్ నొక్కి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలందురూ నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఆదాంబాషా, ఎంపీటీసీ భాస్కర్, సర్పంచ్ మల్లికార్జున, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, రాధాక్రిష్ణ, శేఖర్, కిషోర్‌నాయుడు, వినోద్‌రెడ్డి, దాదుల్లా, నస్రుల్లా, సాలప్ప, వెంకటేశుపాల్గొన్నారు.

నేడు 4వ విడత వైఎస్సార్ చేయూత

మండలంలో మంగళవారం 4వ విడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్టు వెలుగు ఏపీ హరినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొని మహిళలకు చేయూత చెక్కులు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

హామీలు నెరవేర్చాం..అభివృద్ధి చేశాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని, రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు.చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాల వల్లే ధైర్యంగా ప్రజలను ఓట్లు అడుగుతామన్నారు. సోమవారం మండలంలోని పాముగానిపల్లె పంచాయతీ ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఐదేళ్లలో తమ ప్రభుత్వ పాలనలో పంచాయతీలో చేసిన అభివృద్ధి, మంజూరు చేసిన నిధులను ప్రజలకు వివరించారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో పాలకేంద్రం, రూ.1.8 కోట్లతో నాడు-నేడు కింద పాఠశాలల ఆధునీకరణ, రామకుప్పం రోడ్డు నుంచి యర్నపల్లె వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, రామకుప్పం రోడ్డు నుంచి బైసుకుప్పం వరకు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అంతేకాకుండా పాముగానిపల్లె పంచాయితీలో మొత్తం 335 మీటర్ల దూరం రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో కృష్ణమ్మ కొండకు పైప్ లైను వేసినట్లు వివరించారు. గతంలో మీ గ్రామాలు ఎలా ఉండేవి? ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో తేడా గుర్తించండి అని ప్రజలను కోరారు. 20 ఏళ్లు పాలించిన టీడీపీ నాయకులు మండలానికి చేసింది శూన్యమని, తమ జగనన్న సీఎం అయ్యాక ఒక్కో పంచాయతీని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు.

ప్రజలకు న్యాయం చేయని టీడీపీ

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధి కలిగిందేగానీ సామాన్య ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పథకాల ఫలాలు అందించిందని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మళ్లీ మనమంతా కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పీఎస్ నాగరాజు, ఎస్ఏ గౌస్, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీరాములు రెడ్డి, వైస్ ఎంపీపీలు డాక్టర్ తమీమ్, లక్ష్మన్ రెడ్డి, సర్పంచ్ సుబ్బారెడ్డి, నాయకులు శ్రీనివాసులు, పూలనాగ, నారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సయ్యద్ షామీర్, మురళి, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- గంగజాతర ఏర్పాట్లు



మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: ఎన్నికల కోడ్ అమలులోకి రాకమునుపే అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆదేశించారు. సోమవారం కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లకు పనులను కేటాయించారు. అలాగే గంగజాతరకు పారిశుద్ధ్యం, మంచినీరు, విద్యుత్ దీపాలు ఏర్పాట్లకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి నిధులతో నిర్మిస్తున్న భవనాలకు, న్యాయవాదుల సంఘ భవనానికి మున్సిపల్ అనుమతులు మంజూరు చేశారు. చైర్మన్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. గంగజాతర, రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలో ఎలాంటి పారిశుద్ధ్య సమస్యలు, మంచినీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు అనుమతించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ లలిత, నాగేంద్ర పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లస్థలాలు



బైరెడ్డిపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. మండలంలోని లక్కనపల్లె సచివాలయ పరిధిలోని శెట్టిపల్లెలో సోమవారం జగనన్న కాలనీలో 36 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యుల వద్దకు కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తే గ్రామానికి ఒకటో రెండో ఇళ్లను మంజూరు చేసేవారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ క్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు రాజేంద్ర, రఘురామిరెడ్డి, ధనపాల్, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

విగ్రహాల పరిశీలనకు ఆర్కియాలజీ అధికారులు

పలమనేరు: మండలంలో కూర్మాయిలోని పురాతన శ్రీకూర్మ వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం తవ్వకాలు చేస్తుండగా బయటపడిన మహావిష్ణు, శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ఆర్కియాలజీ అధికారులు పరిశీలించనున్నట్టు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు. ఆలయం వద్ద విగ్రహాలు బయటపడిన ప్రదేశాన్ని సిబ్బందితో కలసి సోమవారం ఆయన పరిశీలించారు. ఆలయాన్ని చోళరాజులు నిర్మించినట్టు తెలుసుకున్నారు. విగ్రహాలు లభ్యమైన చోట ఇంకనూ ఏమైనా బయటపడే అవకాశం ఉందా? బయటపడిన విగ్రహాలు ఏ లోహానికి చెందినవి మొదలైనవి పురావస్తుశాఖ నిర్ధారించాల్సి ఉంది. ప్రస్తుతం విగ్రహాలకు ప్రజలు పూజలు చేస్తున్నారు.

పోషణ పక్షోత్సవాలు ప్రారంభం



పలమనేరు: పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పోషణ పక్షోత్సవాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. పౌష్టికాహారం ఆవశ్యకతపై అంగన్‌వాడీ కార్యకర్తలు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ, ఈనెల 23 వరకూ పోషణపై మహిళలకు ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని, ప్రధానంగా చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయాల్లో ఉన్న పోషకాల గురించి స్వచ్ఛంద సంస్థలతో కలిసి తెలియజేయాలన్నారు. పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జోరుగా మాస్ కాపీయింగ్?

బైరెడ్డిపల్లె: మండలంలోని మోడల్‌స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరిగినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఉదయం మ్యాథ్స్-2బి, జువాలజీ-2 పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు కొంత మంది స్లిప్‌లు తీసుకొచ్చి పరీక్షలు రాస్తుండగా స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. అయితే స్క్వాడ్ చూసీచూడనట్టు విద్యార్థులను వదిలిపెట్టారని ఆరోపించారు. దీనివల్ల కష్టపడి చదివిన వారు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

- కలెక్టర్ షణ్మోహన్

పుంగనూరు: త్వరలో జరగనున్న ఎన్నికలకు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం సాయంత్రం పుంగనూరులో నియోజకవర్గ స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఎన్నికలను నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్‌ఓ మధుసూదన్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గౌరమ్మ జాతర

రామకుప్పం: మండలంలోని కెంచనబళ్ల పంచాయతీ పచ్చార్లమాకులపల్లెలో నూతన గౌరమ్మ దేవాలయంలో మంగళవారం అమ్మవారికి మహా మండలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం, గురువారాల్లో కడూఆ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. గురువారం కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని, తొలి ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ. రూ.15000, రూ.10000, రూ.7500, రూ.5000, రూ.3000, రూ.2000 బహుమతిగా ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు చలపతి కోరారు.

యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు పంచాయతీ వడ్డూరు, మర్రిమాకులపల్లె, బేరుపల్లె గ్రామాలకు చెందిన 81మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల యాజమాన్య హక్కు పత్రాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రంగనాథం, సర్పంచ్ బెంగళూరు మునస్వామి సోమవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వం ద్వారా ఇంటిని పొందితే దాన్ని అమ్ముకోవడం లేదా అత్యవసరాలకు బ్యాంకులో తాకట్టు పెట్టుకునే హక్కు లేకుండా ఉండేదని, దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇంటి యజమానులకు సంపూర్ణ హక్కును కల్పించాలని భావించి ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శి బంగారు, వీఆర్వో గోవిందు పాల్గొన్నారు.

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ సుజాత కోరారు. ఈ నెల 12 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ,8వ తరగతిలో ఒక సీటు ఖాళీ ఉందని, ఎంపికైన బాలికలకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా ఇస్తామన్నారు. దీనిని పేద విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

రొంపిచెర్ల: రొంపిచెర్లలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించి 13 ఏళ్లు పూర్తి చేసుకుని 14వ వసంతంలోని అడుగు పెడుతోందన్నారు. సేవా కార్యక్రమాలతో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, విజయశేఖర్, కోటా వెంకటరమణ, నాగిరెడ్డి, బాలాజీ, యుగంధర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుబ్రమణ్యం, విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈరోజు

మున్సిపల్ అత్యవసర సమావేశం

పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మంగళవారం ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ రమణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

దగా చేసిన చంద్రబాబు



వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- హామీలతో వంచించడం ఆయన నైజం
- ఈసారి ఎన్నికల్లో అందరూ బుద్ధి చెప్పండి
- వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ భరత్ పిలుపు

గుడుపల్లె: చంద్రబాబునాయుడు 35 ఏళ్లుగా కుప్పం నియోజక వర్గంలో వన్నెకుల క్షత్రియ ఓట్లతో గెలుపొందిన ప్రతిసారీ వారిని దగా చేస్తూనే ఉన్నారని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. సోమవారం స్థానిక రాళ్లగంగమాంబ ఆలయ ఆవరణలో వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో అధిక శాతం వన్నెకుల క్షత్రియులు ఉన్నా వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చంద్రబాబు వాడుకున్నారన్నారు. అంతేకాకుండా ఆ సామాజిక వర్గానికి ఎలాంటి పదవులూ ఇవ్వకుండా ఆర్థికంగా, రాజకీయ, సామాజికంగా కూడా ఎదగనివ్వలేదన్నారు. ఎన్నికల సమయాల్లో మాత్రం ఒకట్రెండు రోజులు చుట్టపుచూపుగా వచ్చి వారిని మళ్లీ హామీలతో ఊదరగొట్టి, వంచించడం పరిపాటిగా మారిందన్నారు. నియోజక వర్గంలో వన్నెకుల క్షత్రియ కులస్తుల ఓటర్లు 23 శాతం ఉన్నారని, ఈ కులానికి సంబంధించి ఏ ఒక్కరినీ నాయకుడిగా ఎదగనిచ్చిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. ఇకనైనా వన్నెకుల క్షత్రియులు ఆత్మపరిశీలన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమను దగా చేస్తున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రతి వన్నెకుల క్షత్రియులతోపాటు తక్కిన సామాజిక వర్గాల ఓటర్లు సైతం బుద్ధి చెప్పాలని కోరారు. తమ కుటుంబం నియోజకవర్గంలో అందరికీ అండగా ఉంటుందని, ఫోన్ చేస్తే సమస్యలు పరిష్కరించడానికి తాను సదా సిద్ధమేనన్నారు. తన దృష్టికి తెచ్చిన ఏ సమస్య అయినా పరిష్కరించకపోయిన పక్షంలో గ్రామాలకు వచ్చినప్పుడు నిరభ్యంతరంగా నిలదీయవచ్చన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి నేరుగా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించడంతో తాము నిరంతరం ప్రజలతో మమేకమవుతున్నామని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్నదెవరో..లేనిదెవరో ప్రజలు గ్రహించి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. సమావేశంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, ఏడీఎస్ శరవణ, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణమూర్తి, సర్పంచ్ రామ్మూర్తి, కుప్పం కన్వీనర్ మురుగేష్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, మునిరత్నం పాల్గొన్నారు.



వన్నెకుల క్షత్రియ సమావేశానికి హాజరైన మహిళలు

ఆర్బీకేలతో వ్యవసాయం పండుగ



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. చిన్నారిదొడ్డిలో రూ.21లక్షలతో నిర్మించిన వైఎస్ ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్బీకేలతో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను గ్రామాల్లోనే అందుబాటులోకి తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఈ-క్రాప్ విధానంలో ఉచిత పంటల బీమాను అమలు చేయడంతో పాటు పంట నష్టం వాటిల్లిన సందర్భంలో సత్వరమే పరిహారం ఇస్తున్నారని చెప్పారు. వైఎస్ఆర్ రైతు భరోసా పేరిట వ్యవసాయంలో పెట్టుబడికి ఆర్థిక సాయం చేస్తోందని, రైతులకు బ్యాంకు రుణాలను కూడా ఇస్తోందన్నారు. రైతులు ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని పండుగ చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, సర్పంచ్ బాలసుబ్రమణ్యం, ఎంపీటీసీ బీఎస్ వెంకటేశు, నాయకులు రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు



గర్భవతులను పరీక్షిస్తున్న చేస్తున్న డాక్టర్ వినయ్



బైరెడ్డిపల్లె: గర్భవతులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

రొంపిచెర్ల: గర్భవతులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం పేరిట గర్భవతులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గర్భవతులు గుండె, బీపీ, షుగర్, ఉదర, రక్త పరీక్షలు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణను గర్భవతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ ఆస్పతులలోనే కాన్పులు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులలో కా న్పులు చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం కూడా చేస్తాయని తెలియజేశారు. సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు భారతి, గీతాశ్రీ, ఆరోగ్య కార్యకర్తలు సుమిత్ర, గాయత్రి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సోమవారం మహతి ఫౌండేషన్ సౌజన్యంతో వైద్యాధికారి విజయ్‌చంద్ర గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, గర్భవతులు క్రమం తప్పకుండా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేసుకోవాలని కోరారు. రక్తహీనత లోపం వలన కలిగే అనర్థాలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకురాలు శాంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయినులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: శ్రీరామాపురం ఎంపీపీ పాఠశాలలో ఎస్టీయూ మండల శాఖ సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. అసోసియేషన్ అధ్యక్షులు బాబురెడ్డి మాట్లాడారు. ప్రతి పనిలో మహిళలు ముందుండి నడిపించడం వల్లే అన్నింటా ముందుకువెళ్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయినులను సన్మానించారు. మండల ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, ఆర్థిక కార్యదర్శి శివప్రకాష్ బాబు, పుంగనూరు డివిజన్ కన్వీనర్ నారాయణస్వామి, జిల్లా ఆర్థిక సంఘ సభ్యులు నాగరాజ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

చౌడేపల్లె: స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయినులను, ఎంఈఓ తిరుమలమ్మను ఘనంగా సత్కరించారు.



చౌడేపల్లె: సన్మానం అందుకున్న ఉపాధ్యాయినులతో ఎంఈఓ